క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం: మండలంలోని ఆరమడక, మూగలమర్రి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ భాస్కర్ తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని వారు కోరారు.

నేడు మండల సమావేశం

వాల్మీకిపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

మానిటరింగ్ కమిటీ సమావేశం

పెద్దతిప్పసముద్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. దళితులు అధికంగా ఉన్న ఐదు గ్రామాల్లో స్మశానానికి స్థలాలతో పాటు దారి సౌకర్యం కల్పించాలని, కౌలు రైతులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని, అంబేడ్కర్ జయంతి రోజున ఏదో ఒక ప్రభుత్వ సంక్షేమ పథకం మంజూరుకు శ్రీకారం చుట్టాలని దళిత సంఘాల నాయకులు సభ దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డితో పాటు పలు శాఖల అధికారులు హాజరయ్యారు.

పోషణ కిట్లు అందించాలి

నిమ్మనపల్లె : వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు, బాలామృతం, కోడిగుడ్లు, తదితర పోషక పదార్థాలను గర్భవతులు, బాలింతలకు సకాలంలో అందేలా అంగన్‌వాడీ కార్యకర్తలు పని చేయాలని సీడీపీఓ సుజాత అన్నారు. గురువారం మండలంలోని ఎగువమాచిరెడ్డిగారిపల్లెలో జరిగిన అంగన్‌వాడీ సెక్టార్ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భానులక్ష్మిదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపరిహారం పెంచి ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

వాల్మీకిపురం: ఎన్‌హెచ్ 71 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని టీకలకోన బాట గంగమ్మ ఆలయం తొలగించారు. ఈ గుడికి నష్టపరిహారం రూ.7.8 లక్షలు మంజూరు చేశారు. కానీ గుడి నిర్మాణానికి రూ.35 లక్షలకు మించి అవుతుందని మండలంలోని తాటిగుంటపల్లి, మూరేవాండ్లపల్లి గ్రామస్తులు గురువారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను కలసి వినతిపత్రం అందించారు. గుడి నిర్మాణానికి నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీరామిరెడ్డి, రెడ్డిఅర్జున్ రెడ్డి, ద్వారకనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షమ్మకు పూజలు

వాల్మీకిపురం: మండలంలోని గొళ్లపల్లిలో రూ.40లక్షలతో నిర్మించిన విరూపాక్షమ్మ ఆలయాన్ని గురువారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రారంభించారు. గొళ్లపల్లి గ్రామస్థులు, భక్తుల సహకారంతో నూతనంగా ఆలయాన్ని నిర్మించుకున్నారు. అనంతరం విరూపాక్షమ్మ విగ్రహాన్ని అర్చకుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా ప్రతిష్ఠించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతల శివానంద రెడ్డి, మొగ్గంరెడ్డి రాం కుమార్ రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, కువైట్ శంకరాచారి, గొళ్లపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

బి.కొత్తకోట: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామమోహన్ గురువారం తెలిపారు. గోళ్లపల్లె పంచాయతీ బంగ్లాగడ్డకు చెందిన రెడ్డెమ్మ (60) కర్ణాటక మద్యం విక్రయిస్తోంది. దీనిపై అందిన సమాచారంతో దాడులు నిర్వహించగా 70 ప్యాకెట్ల మద్యం పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదుచేసి మహిళను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

గర్భవతుల నమోదు తప్పని సరి

కలకడ : మండలంలోని ప్రతి గ్రామంలో గర్భవతుల నమోదు తప్పని సరిగా జరగాలని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోగల కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలను అందజేశారు. యంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పీలేరు రూరల్ : అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని మేళ్లచెరువు పంచాయతీ హరిజనవాడకు చెందిన నీరుగట్టు సహదేవ భార్య నాగరాజమ్మకు రూ. 10 వేలు, అదే గ్రామానికి చెందిన జి. నాగరాజుకు రూ. 10 వేలు చొప్పున ఆర్థికసాయం చేశారు. స్థానిక సర్పంచ్ చిన్నకొండయ్య, ఎంపీటీసీ కిరణ్‌కుమార్‌నాయుడు ఇద్దరికీ పది వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు రవి, అమరనాథరెడ్డి, వెంకటరమణనాయుడు, శ్రవణ్, బొజ్జయ్యనాయుడు పాల్గొన్నారు.

ఇంటర్‌లో సత్తాచాటిన విద్యార్థులు



అశోక్‌కుమార్



వాసవి



సమత

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులు సత్తాచాటారు. బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్‌లో 51 మంది విద్యార్థులకుగాను 39 మంది పాసై 76 శాతం, ద్వితీయ సంవత్సరంలో 55 మందికిగాను 47 మంది పాసై 85 శాతం ఫలితాలు సాధించినట్లు అధ్యాపకులు వెంకటరాముడు తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో కిరణ్మయి ఎంపీసీ గ్రూపులో 428, రూపశ్రీ బైపీసీ 339, సీఈసీలో షంషావల్లి 419 మార్కులతో ఏ గ్రేడ్‌లో నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో అశోక్‌కుమార్ 1000 మార్కులకుగాను 950 మార్కులు సాధించి మొదటి స్థానం నిలిచారు. వాసవి 942, ఆలీషా బైపీసీలో 918, యశ్వంత్‌కుమార్ 910, సీఈసీ గ్రూపులో పవిత్ర 752 ఏ గ్రేడ్‌లో నిలిచారు. మోడల్ స్కూల్‌లో మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ ఎంపీసీ గ్రూపులో సమత 950 మార్కులు, బైపీసీలో సుమాజంలి 927 మార్కులు, సీఈసీలో తేజస్విని 933 మార్కులు సాధించారు.

రామసముద్రంలో...



వర్ష

రామసముద్రం: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో రామసముద్రం కేజీబీవీ, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రేణుక 904, పవిత్ర 890, మల్లేశ్వర్ 747, నేత్ర 724 మార్కులతో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ మురళీధర్ తెలిపారు. అలాగే కేజీబీవీలో ద్వితీయ సంవత్సరంలో 78 శాతం, మొదటి సంవత్సరంలో 52 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ విజయలక్ష్మి తెలిపారు. అలాగే మోడల్ స్కూల్‌లో ద్వితీయ సంవత్సరంలో వర్ష 960 , దివాకర్‌రెడ్డి 952, ప్రథమ సంవత్సరంలో సుస్మిత 440, శరత్‌కుమార్ 429 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మునస్వామి నాయక్ తెలిపారు.

కలకడలో...



ఐశ్వర్య

కలకడ : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల హవా కనిపించింది. కలకడ కస్తూర్బా గాంధీ గురుకుల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 97 శాతం మంది, ద్వితీయ సంవత్సరంలో 93 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ ఆదిత్య తెలిపారు. 967 మార్కులతో రేణుక, 948 మార్కులతో ఐశ్వర్య, లక్ష్మిదేవి, 947 మార్కులతో తులసి, 940 మార్కులతో నందిశ ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు తెలిపి అభినందనలు తెలిపారు. ఆదర్శ పాఠశాలలో మొదటి సంవత్సరంలో 51.47 శాతం, ద్వితీయ సంవత్సరం 83 శాతం, ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

బి. కొత్తకోటలో..

బి.కొత్తకోట: ఇంటర్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్, మోడల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జూనియర్ కళాశాల ఇంటర్ రెండో సంవత్సరం హెచ్ఈసీ విద్యార్థి షేక్ హుసేన్ వలీ 1000 మార్కులకు 935 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థిని గురువారం వైఎస్సార్‌సీపీ, బాస్ నాయకులు మహేష్, సబ్జి, సచిన్, సింగన్న, పలక వెంకటేష్, శ్రీనివాసులు శాలువతో సత్కరించారు. మోడల్ కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థి ఎం.రేవంత్‌రెడ్డి 932 మార్కులు, బైపీసీ విద్యార్థిని పి.ధనలక్ష్మి 916 మార్కులు సాధించారు.

ములకలచెరువులో...

ములకలచెరువు: బురకాయలకోట గురుకుల పాఠశాల బాలికలు ప్రతిభ కనబ రిచారు. ఇంటర్ మొదటి సంవత్సరం 77 శాతం, రెండో సంవత్సరం 86 శాతం ఉతీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సుభాషిని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూపుకు చెందిన టి.శైలజ 480, ఇంటర్ రెండో సంవత్సరం సీఈసీ గ్రూపులో పవిత్ర 941 మార్కులు సాధించినట్లు చెప్పారు.

పెద్దతిప్పసముద్రంలో...



మేకల హారిక



వీ.శిరీష

పెద్దతిప్పసముద్రం: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక మోడల్ స్కూల్ బాలికలు సత్తాచాటారు. ఎంపీసీ విభాగంలో మేకల హారిక 976 మార్కులు, బైపీసీలో వీ.శిరీష 933 మార్కులు, సీఈసీలో పీ.ప్రతిభ 803 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శివకుమారి గురువారం పేర్కొన్నారు. మొత్తం 44 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వీరిలో 40 మంది ఉత్తీర్ణులైనట్లు ఆమె పేర్కొన్నారు.

వాల్మీకిపురంలో...



అంజూమ్ రెహబర్

వాల్మీకిపురం: స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించారు. కళాశాలలో బైపీసీకి చెందిన అంజూమ్ రెహబర్ 958 మార్కులు, సిరికల్చర్ గ్రూపులో హర్షిత 887మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందని కళాశాల ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి తెలిపారు.

అలాగే తరిగొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 77.27 శాతం, ద్వితీయ సంవత్సరంలో 67.08 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ రమామంజుల తెలిపారు. గురుకులంలో ద్వితీయ సంవత్సరంకు చెందిన దనిషా సుభాని 973 మార్కులు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి చెందిన షాహీదా 949 మార్కులు సాధించారు.

గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

కేవీపల్లె : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో మండంలోని గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ విద్యార్థులు విశేష ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ చెన్నకేశవులు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 114 మంది పరీక్షలకు హాజరు కాగా వందశాతం, మొదటి సంవత్సరం 104 మంది పరీక్షలకు హాజరు కాగా 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు అజయ్‌కుమార్, ఎం. గోవర్ధన్ వెయ్యికి 963 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు సాయిప్రభాస్ 459, కె. భరత్ 458 మార్కులతో రాణించినట్లు తెలిపారు. అలాగే కేవీపల్లె ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ సంవత్సరం 92 శాతం, మొదటి సంవత్సరం 71 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎ. వర్షిత 979, పి. రక్షిత 967, ఎ. నికిత్ 966 మార్కులు సాధించి ప్రతిభ చూపినట్లు తెలిపారు.

ప్రైవేట్ కళాశాలల ప్రభంజనం

మదనపల్లె : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలు మెరుగైన ఫలితాలతో ప్రభంజనం సృష్టించాయి. జ్ఞానాంబిక జూనియర్ కళాశాల విద్యార్థిని సి.శిల్ప సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1,000కి 991 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండోర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా అకడమిక్ ప్రిన్సిపాల్ రాటకొండ వెంకటాచలపతి మాట్లాడుతూ.. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో జ్ఞానాంబిక 80.23శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. తమ కళాశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ ఎంపీసీలో 1,000 మార్కులకు సి.శిల్ప 991, సుమియా 988, ఎంఈసీలో పి.పావని 976, జి.పావని 958, బైపీసీలో బిందుప్రియ 959, హఫీసా 958, సీఈసీలో కే.అనిత 966, తస్మియా 965 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 470 మార్కులకు సి.వాణి 458, ఎం.కవిత 454, ఎంఈసీలో 500 మార్కులకు ఆర్.రమ్యప్రియ 426, జే.పావని 412, బైపీసీలో 440 మార్కులకు బి.మేఘన 423, కే.అప్సరాఖానం 423, సీఈసీలో 500 మార్కులకు సుహైల్ 471, జ్యోతి 460 మార్కులతో సత్తా చాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు అభినందించారు.

– అలాగే శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కాలేజీలో సీనియర్ ఎంపీసీలో 1,000 మార్కులకు ఏ.హర్షిణిప్రియ 989, ఎస్.హర్షిత 986, హిమబిందు 985, కీర్తన 984, కుష్రత్ 984, ప్రణీత 979, బైపీసీలో ఎం.మడోన్న 974, సోనియా 965, చందుశ్రీ 965, సీఈసీలో జానకి 942, అనిత 940 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు ఎం.కిషోర్ 459, వంశీకృష్ణ 458, వై.సిరి 456 మార్కులు సాధించారు.

బైపీసీలో 440 మార్కులకు మహేంద్ర 433, శేషాద్రి బుషిత 431, సీఈసీలో 500 మార్కులకు ఎం.గాయత్రి 476, గుణశ్రీ 451 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా చేతుల మీదుగా ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు.



జ్ఞానాంబిక జూనియర్ కళాశాలలో విద్యార్థిని శిల్పను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటాచలపతి



శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా హుమయూన్

పీలేరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా మాజీ సర్పంచ్ ఎ.ఎస్. హుమయూన్‌ను నియమించినట్లు ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం పీలేరులో హుమయూన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న హుమయూన్‌కు సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. అనంతరం కేవీపల్లె మండలం సారకాయలపేటకు చెందిన పలువురు ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా పాల్గొన్నారు.

వక్ఫ్ పరిధిలోకి దర్గాలు, మసీదులు

బి.కొత్తకోట: కేంద్రప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో ముస్లింలకు చెందిన సామూహిక ఆస్తులుగా పరిగణించేవన్నీ వక్ఫ్‌బోర్డు పరిధిలోకి వస్తాయని ఆ బోర్డు జిల్లా చైర్మన్ ఎస్‌ఏ.కరీముల్లా చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మసీదులు, దర్గాలు, ఈద్‌గాహ్‌లు, ఖబర్‌స్థాన్‌లు, ఆషుర్‌ఖానాలు, ముసాఫిర్ ఖానాలు, తకియా, చిల్లాలు, జెండాచెట్టు తదితర మతపరమైన సంస్థలు వక్ఫ్ పరిధిలోకి వస్తాయని చెప్పారు.

సింగల్ విండో బ్యాంకు ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని రైతులకు ఆర్థికాభివృద్ధి కోసమే సింగల్ విండో బ్యాంకు భవనాన్ని నూతన సౌకర్యాలతో ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో సుమారు రూ.53 లక్షల అంచనాతో నిర్మించిన కన్నెమడుగు సింగల్ విండో బ్యాంకు భవనాన్ని ఆయన ప్రారంభించారు. డీజీఎం లిల్లిక్యాథరే మాట్లాడారు. అనంతరం రూ.15 లక్షలతో నిర్మించిన ఎఫ్‌పిఓ కలెక్షన్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అరుణమ్మ, కాంట్రాక్టర్లు నరేంద్రరెడ్డి, వై.వి.రమణారెడ్డి, చీఫ్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రమణ, సింగిల్ విండో డైరెక్టర్లు లీలావతి, సాదిక్, సీఈఓ భాస్కర్‌రెడ్డి, తహశీల్దార్ కళావతి, ఎంపీడీఓ ఆనందకుమార్, ఏపీఎం గంగాధర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, మల్లయ్యకొండ చైర్మన్ మల్లిరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం

– ఎంపీ మిథున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంఎస్ఆర్ కల్యాణమండపంలో పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఓసీ కేటగిరికి కేటాయించబడినా, బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన చంద్రగిరి యల్లయ్యను ఏఎంసీ ఛైర్మన్ చేయడం జరిగిందన్నారు. పార్టీకి విశ్వాసంగా ఉన్న అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. వడ్డెర కులస్తులకు జనాభా ప్రాతిపదికగా చూస్తే రాజకీయంగా వారికి సరైన న్యాయం జరగలేదని గుర్తించామని చెప్పారు. దీంతో వడ్డెరలకు మంచి సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో వడ్డెర సామాజిక వర్గానికి ఉన్నతమైన ఏఎంసీ ఛైర్మన్ పదవి ఇచ్చినట్లు తెలిపారు. నాలుగేళ్ల జగనన్న పరిపాలనలో జరిగిన అభివృద్ధి, చంద్రబాబు పద్నాలుగేళ్ల పరిపాలన మధ్య వ్యత్యాసం గమనించాలన్నారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దు అని పిలుపునిచ్చారు. అనంతరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రగిరి యల్లయ్యను, వైస్ ఛైర్మన్ రమేష్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీలు సతీష్‌రెడ్డి, ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, గజ్జెల శృతి, పార్టీ మండల కన్వీనర్లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం

పీలేరు రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని ఏవో రమాదేవి అన్నారు. గురువారం మండలంలోని ముడుపువేముల వీవో 2 పరిధిలో వెలుగు సభ్యుల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నేలతల్లి బాగుంటుందని, ఆరోగ్యకరమైన పంట దిగుబడి ఉంటుందని తెలిపారు. రైతులందరూ విధిగా రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటీ సుధా, ఎల్ఐ చిరంజీవి, ఎల్3డీ సావిత్రి, సర్పంచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు

కేవీపల్లె : ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, ఏపీఐఐసీ కార్పొరేషన్ డైరెక్టర్లు కారపాకుల భాస్కర్‌నాయుడు, ప్రదీప్‌రెడ్డి అన్నారు. గురువారం తిమ్మాపురం పంచాయతీ చిన్నకమ్మపల్లెలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దుకృష్ణ, మంజు, రామ్మోహన్, మురళి, గోవర్ధన్, విశ్వ, లోకేష్, అమర తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

బి.కొత్తకోట: కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం బి.కొత్తకోటలో ఆ పార్టీ సాంస్కృతిక విభాగం మండలస్థాయి కమిటీ ఎన్నిక సమావేశం జరిగింది. ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాలకు అండగా నిలిచిందన్నారు. సమావేశంలో బి.కొత్తకోట మండల అధ్యక్షులుగా రమణప్ప, ఉపాధ్యక్షులుగా సిద్ధారెడ్డి, కార్యదర్శిగా లక్ష్మిదేవి, సహాయకార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా నరసింహారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా అంజనమ్మను ఎన్నుకొన్నట్టు సుధాకర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షులు కత్తి శివమణి పాల్గొన్నారు.

శ్రీనివాస డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభం



ఎంపీ మిథున్‌రెడ్డికి మెమెంటో అందిస్తున్న శ్రీనివాస డిగ్రీ కళాశాల యాజమాన్యం

మదనపల్లె : పట్టణంలోని శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన మదర్‌థెరిసా బ్లాక్‌ను గురువారం ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యాబోధనలో ఉన్నతమైన నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ, విద్యార్థులకు అవసరమైన వసతులు, అధునాతన ల్యాబ్ సౌకర్యంతో పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో కళాశాల నిర్వహణ చేస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్ చైర్మన్ జింకా చలపతి, నూర్‌ఆజం, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తట్టి శ్రీనివాసులు రెడ్డి, గుండ్లూరు రఫీ, గార్ల చంద్రమౌళి, చందూ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బి.వి. రమణాచారి పాల్గొన్నారు.

29న ఎక్సైజ్ వాహనాల వేలం

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో సీజ్‌చేసిన వాహనాలను ఈనెల 29వ తేదీ శనివారం ఉదయం 10గంటలకు వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. గురువారం ఎస్ఈబీ స్టేషన్ విడుదల చేసిన పత్రికాప్రకటనలో... వాహనాల వేలంలో పాల్గొనే వారు జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, ప్రభుత్వం నిర్దేశించిన డిపాజిట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మదనపల్లె తహసీల్దార్‌గా బావాజాన్

మదనపల్లె : మదనపల్లె మండల ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ బావాజాన్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ గిరీషా.పీఎస్. గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సీకే.శ్రీనివాసులను అన్నమయ్య జిల్లా కలెక్టరేట్, రాయచోటిలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చదువులో రాణించాలి

మదనపల్లె సిటీ: మైనార్టీ విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక బసినికొండ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో పూర్వ జిల్లా ఉర్దూ మానిటరింగ్ అధికారి మహమ్మద్‌ఖాన్, ఉపాధ్యాయులు షరాఫత్‌అలీఖాన్, నూర్జహాన్, ఎస్టీయూ నాయ కులు నరసింహులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం వల్ల అనర్థాలు

మదనపల్లె సిటీ: పొగాకు వాడకం వల్ల పలు అనర్థాలు తలెత్తుతాయని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. గురువారం కాలేజీలో పొగాకు వినియోగం–దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సైక్రియాటిస్టు డాక్టర్ రాధిక, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జ్యోతి, అధ్యాపకులు వనజ, నమ్రత, లక్ష్మిదేవి, నాగమణి పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనం

పీలేరురూరల్ : బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సామూహిక ఉపనయన కార్యక్రమం నిర్వహించారు. గురువారం జగద్గురు శంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సామూహిక ఉపనయనం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చినవారు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకరాచార్యుల చిత్ర పటాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరి రావు, ఫణీంద్ర పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల కన్న తల్లి పద్మావతమ్మను గురువారం స్థానికులు ఘనంగా సత్కరించారు. పద్మావతమ్మ తంబళ్లపల్లెకు వచ్చి మల్లయ్యకొండపై వెలిసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకోగా స్థానికనాయకులు మెడికల్‌షాపు నారాయణరెడ్డి, బీసీ నాయకులు రామమూర్తి, కళాకారుల సంఘం అధ్యక్షులు కత్తి రామలింగారెడ్డి, స్థానిక మహిళలు శాలువలు కప్పి సత్కరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయానికి రూ. 25,116 దాతలు అందజేశారు. ప్రస్తుతం ఆలయంలో గర్భాలయం పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో గురువారం బెంగుళూరుకు చెందిన పరంధామ్, రేఖ తమ కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకొని రూ.25,116ను ఊటమంజులకు విరాళంగా అందజేశారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలని జిల్లా ప్రజారవాణాధికారి రాము అన్నారు. గురువారం స్థానిక టు డిపోలో గేట్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అరుణాచలం, వివాహాలకు ప్రత్యేక సర్వీసులు నడపాలన్నారు. అనంతరం డీఎం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంలు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్, సీఐలు గీత, రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసం

మదనపల్లె : సైబర్ మోసంతో చేనేతకార్మికుడు రూ.50వేలు పోగొట్టుకున్న సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన చేనేత కార్మికుడు సుబ్రహ్మణ్యం సెల్‌ఫోన్‌కు గురువారం టెక్స్ట్ మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి చూస్తుండగా నాలుగు విడతల్లో రూ.50వేలు రూపాయలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. జరిగిన మోసాన్ని గుర్తించిన బాధితుడు సుబ్రహ్మణ్యం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.